


# ధనేషణ

డా॥ ఏ. రాజకుమారి

**ఫైలు** చేత్తో పట్టుకొని నీరసంగా గుమ్మంలో అడుగు పెట్టాడు శంకరం.

హాల్లో వడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న తండ్రి రామకృష్ణయ్య, గడప నానుకుని కూర్చుని చేటలోని బియ్యంలో రాళ్లేరుతున్న జానకమ్మ అతని రాక కోసమే ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

కొడుకు మొహంలో కనిపిస్తున్న నిరాశా, నిస్పృహాలను గమనించగానే అర్థమై పోయినా అడగకుండా ఉండలేక పోయారు.

"ఏమైంది ఇంటర్వ్యూ?"

గత ఏడెనిమిదేళ్లుగా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పీ, చెప్పి విసిగి పోయిన శంకరం విసురుగా తలెత్తి చూశాడు.

"ఏముందీ? ఉత్తర, దక్షిణాల వరుగు పందెంలో మన దెవ్వుడూ వెనుక స్థానమే. ఫస్టు క్లాసులూ, గోల్డ్ మెడల్స్ ఎవరికి కావాలి?"

"ఏం చేస్తాం? ఇంకా మన కా అదృష్టం కలసి రాలేదు." ఓదార్పుగా అన్నాడు రామకృష్ణయ్య

"లేదు నాన్నా! పాతిక వేలుమనవి కాదనుకుంటే, ఉద్యోగ దేవత రేపీపాటికి మన గుమ్మంలో ఉంటుంది."

"అదేమిటి?" తెల్లబోయి చూశాడు ఆ పూర్వకాలం తండ్రి.

" అవును నాన్నా! ఇంటర్వ్యూ బోర్డులో మా ఫ్రెండ్ వాసు బావగారు ఉన్నారు. మనకి కాబట్టి పాతిక వేలు ఇవ్వగలిగితే ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానన్నారట. కావాలంటే నెల రోజుల పాటు రిజల్ట్స్ ఆపు చేస్తానన్నారు." ఆశగా చూశాడు శంకరం.

"హుం! పాతిక వేలు." నిట్టూర్చాడు రామకృష్ణయ్య" నిజానికా పాతిక వేలే ఉంటే మీ అక్కని ఏనాడో అత్త వారింటికి సాగనంపి ఉండే వాడిని, ఎక్కడ నుండి తీసుకు రాగలం పాతిక వేలు? మరో ఉద్యోగానికి ప్రయత్నించ వచ్చును లే."

"ఆ! మరో ఆరు నెలల్లో ప్రభుత్వోద్యోగానికి వయః పరిమితి దాటి పోతుంది. అప్పుడిక ఏ రైలు క్రిందో తలపెట్టడం తప్ప వేరే దారి లేదు." విసురుగా లోపలకు నడిచాడు శంకరం.

అంత వరకూ తండ్రీ కొడుకుల మాటలను వింటూన్న జానకమ్మలో చలనం వచ్చింది.

"మీతో ఉద్యోగం చేసిన వాళ్లు ఎంత మంది లక్షలు వెనకేసుకో లేదు. హాయిగా సారె, చీరెలతో కూతుళ్లను అత్తవారిళ్లకు సాగనంపారు. కొడుకులకు డొనేషన్లు కట్టి ఇంజనీర్లనూ, డాక్టర్లనూ చేశారు. మీరు మాత్రం, మీ చేతగాని తనానికి నీతి, నియమాలనే బురఖా తగిలించుకుని పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేశారు. అంతే లెండి పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు" అని,"ఏ జన్మలోనో మహా పాపం చేసి ఉంటాను. అంతా నా ఖర్మ." చేతగాని ఉక్రోషంతో ఒక్కసారిగా బావురు మంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

చేయని నేరానికి ఉరి శిక్ష వడ్డ ఖైదీలా నిస్సహాయంగా నిలబడి పోయాడు రామకృష్ణయ్య.

• • • •

రాత్రి ఎంతకూ కన్నుమూత బడలేదు రామకృష్ణయ్యకు. భార్యా కొడుకూ మాటలే మనసులో మెదలగా, మనసంతా అల్ల కల్లోలంగా ఉంది.

పాతిక వేలు సంపాదించగలిగితే కొడుకు ఉద్యోగస్థుడవుతాడు.

కానీ, నేటి రోజుల్లో పాతిక వేలు ఎక్కడ నుండి తీసుకు రాగలడు?

ఇళ్లు కట్టుకోవడానికీ, వ్యాపారాలు చేసుకోవడానికీ, ఆఖరికి ఉన్నత విద్య కోసం విదేశాలు వెళ్లే వారికీ అప్పులు ఇస్తున్నామనే జాతీయ బ్యాంకులు, ఉద్యోగాలకు లంచం ఇవ్వడానికి కూడా 'లోన్' ఇచ్చే సౌకర్యం కలిగిస్తే ఎంత బాగుంటుంది?

మనసులోనూ, బయటా ఆవరించుకుని ఉన్న చీకటిని చీల్చుకుంటూ వినిపిస్తోంది సన్నగా భార్య ఏడుస్తున్న శబ్దం.

భార్యను ఓదార్చే సాహసం చెయ్యలేని రామకృష్ణయ్యలో ఆలోచనలు అలా సాగిపోతూనే ఉన్నాయి.

నిముషాలు గంటలుగా కాలమూ అలా సాగిపోతూనే ఉంది.

• • • •

"బాబూ శంకరం! ఒక్కసారి డాక్టరు గారి దగ్గరికి వెళ్లి వద్దాం. సాయం వస్తావా?"

న్యూస్ పేపరులో 'వాంటెడ్ కాలమ్స్' చూస్తున్న శంకరం తండ్రి మాటలకు ఒక్కసారి తలెత్తి చూశాడు.

"ఏమైంది?" ఆత్రుతగా అడిగాడు.

"ఏం లేదు. రాత్రి భోజనం అరిగినట్లు లేదు. పైగా కాళ్ల నొప్పులు..." అంటున్న తండ్రి వైపు



జుగుప్సగా చూశాడు.

అంటే....!?! రాత్రి తన దారిన తాను హాయిగా భోజనం చేసి పడుకున్నాడన్న మాట. పైగా తిన్నది జీర్ణం కాలేదట.

ఛ! ఏం మనిషి? ఉద్యోగం లేక కొడుకూ, అత్తవారింటికి వెళ్లే అవకాశం లేక కూతురూ అల్లాడి పోతుంటే, వారిద్దరినీ చూసి దిక్కుతోచక అమ్మ విలవిలలాడి పోతుంటే, ఈయనగారు తన వైద్యం కోసం వెంపర్లాడి పోతున్నాడంటే, ఇక ఏమనుకోవాలి?

"ఏరా! వస్తున్నావా? నన్ను ఒంటరిగానే వెళ్లమంటావా?" తండ్రి మాటలలోని సీరియస్‌నెస్‌ని గమనించిన శంకరం పేపరు అక్కడే పడేసి తండ్రిని అనుసరించాడు అయిష్టంగానే.

వారిద్దరి మాటలూ వింటున్న జానకమ్మ వారు వెళ్లిన వైపే అయోమయంగా చూస్తూ నిలబడి పోయింది.

• • • •

'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడి పోయిందని', రామకృష్ణయ్య కాళ్ల పీకుడికి ఇంజక్షన్ చేయించుకుంటే, అదికాస్తా ఇన్ఫెక్షన్ అయి, కోతి పుండు బ్రహ్మరాక్షసి అయింది.

ఇన్ఫెక్షన్ వస్తే వచ్చింది కానీ, డాక్టరు గారి మీద వినియోగదారుల ఫోరంలో కేసు వేద్దామనుకున్నాడు నష్ట పరిహారం కోసం. లాయర్ వేణుని సంప్రదిస్తే, అతగాడు తన వాక్చాతుర్యంతో కేసు కోర్టుకి వెళ్లనవసరం లేకుండానే సెటిల్ చేశాడు.

డాక్టరు గారి వద్ద నుండి ముప్పై వేలు వసూలు చేసి, అయిదు వేలు తన ఫీజు నిర్మొహమాటంగా వసూలు చేశాడు.

అన్న మాట ప్రకారం పాతికవేలూ పుచ్చుకుని శంకరానికి అపాయింటుమెంటు ఆర్డరు ఇచ్చాడు వాసు బావగారు.

• • • •

ఆ రోజు ఉదయం నిద్ర లేచేసరికే రామకృష్ణయ్యకు ఒళ్లంతా ఏమిటో బరువుగా అనిపించింది.

బ్రష్ చేతిలోకి తీసుకునే సరికి తెలిసింది. దవడ కండరాలు బిగుసుకు పోయాయని.

ఏమైందో అర్థం కాక భార్యను పిలవాలనుకునేంతలోనే, ఒళ్లంతా బిగుసుకు పోయి, ఒక్క సారిగా కుప్పకూలి పోయాడు.


శంకరం కంగారుగా డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లాడు.

• • • •

"అయాం సారీ! ఇది ధనుర్వాతం. వెంటనే జనరల్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లండి." డాక్టరు మాటలకు తలమీద పిడుగు పడినట్లయింది శంకరానికి.

ఎక్కడి జనరల్ హాస్పిటల్. నలభై మైళ్ల దూరంలో ఉన్న హాస్పిటల్‌కి తీసుకువెళ్లడం ఎలా? ఈ లోగా మరింత ప్రమాదం కదూ! ఇది వరకు తన ఫ్రెండ్ సురేష్ అన్నగారికి ధనుర్వాతం వస్తే ఈ డాక్టరు గారే వైద్యం చేశారన్న విషయం గుర్తుకు వచ్చి, వైద్యం చేయమని ప్రాధేయపడ్డాడు శంకరం.

"అయాం సారీ! కండిషన్ సీరియస్‌గా ఉంది.



తీరా అడ్మిట్ చేసుకున్న తరువాత ఈయనకేమైనా అయితే, నాగతి ఏమిటి? ఒకసారి అయిన అనుభవం చాలు. వెంటనే జనరల్ హాస్పిటల్‌కి తీసుకు వెళ్లండి."

ఎంతగా ప్రాధేయపడినా డాక్టరు రాతి గుండె కరగ లేదు.

చివరికి టాక్సీలో తండ్రిని తీసుకుని బయలు దేరాడు.

కానీ, మధ్య దారిలోనే తండ్రికి నూరేళ్లూ నిండిపోయాయి.

● ● ● ●

ఎదురుగా పాడె మీదనున్న తండ్రి కన్నీటి తెరల మధ్య మసక మసకగా కనిపిస్తున్నాడు.

శంకరం మనసంతా శూన్యంగా ఉంది. లోపలి నుండి, తల్లీ, అక్కా చేస్తున్న రోదన ధ్వనులతో మనసు చిల్లులు పడుతోంది.

"పాపం! నిన్నటి దాకా మనిషి పిడుగులా తిరుగుతూ ఉండేవాడు. ఎంతలో మృత్యువు తీసుకొచ్చింది?"

"అనవసరంగా పెద్దానుపత్రికి ప్రయాణం చేసి ఆలస్యం చేశారు. ముందే మన డాక్టరు గారి చేత వైద్యం చేయించి ఉంటే బ్రతికేవాడేమో?"

"ధనుర్వాతం, ప్రమాదస్థితిలో ఉన్నాడని డాక్టరు గారే పెద్దానుపత్రికి తీసుకు పొమ్మన్నారట కదా!"

'ధనుర్వాతం వచ్చిన వాళ్లు ఎంతమంది డాక్టరు గారి దగ్గర వైద్యం చేయించుకుని బ్రతికి బయట పడలేదు. ఆయన దగ్గరకు వెళ్లే సరికే పరిస్థితి చేయిదాటి పోయి ఉంటుంది"

"అదేం కాదులే. ఈ మధ్య ఏదో ఇంజక్షన్ వేయించుకుంటే, వికటించిందట. అందుకని డాక్టరు గారి మీద కేసు పెట్టి నష్టపరిహారం వసూలు చేసుకున్నాడట రామకృష్ణయ్య. ఆ కోపం మనసులో పెట్టుకుని ......"

వెనుక నుండి ఉండి ఉండీ మాటలు వినబడుతున్నాయి.

నిజంగా డాక్టర్ వెంటనే వైద్యం చేసి ఉంటే నాన్న బతికి ఉండేవాడేమో!

ఎంతగా ప్రాధేయపడినా డాక్టరు గారి మనసు కరగలేదే?

"ఒకసారి అయిన అనుభవం చాలు! చూస్తూ చూస్తూ మరోసారి రిస్క్ తీసుకోలేను" అన్న డాక్టరు గారి మాటలు మనసులో మెదిలాయి.

నిజంగా డాక్టరు దగ్గర నష్టపరిహారం తీసుకోవడమే తమ పొరపాటా?

మరి డాక్టరుగారి పొరపాటుకి నాన్న శారీరకంగా అంత బాధపడ్డాడే! దానికి నష్టపరిహారం కోరడం కూడా తప్పేనా?

ఆలోచించే శక్తి లేని మనసుతో యాంత్రికంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు శంకరం.

** ** **

**కాలం** ఎవరి కోసమూ ఆగదు. ఎవరి సుఖ దుఃఖాలతోనూ దానికి నిమిత్తం లేదు.

బంధుమిత్రులంతా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. రామకృష్ణయ్య లేని లోటుకి అలవాటు పడుతున్నారు.

"శంకరం! గుడ్ న్యూస్!" సంతోషంగా లోపలకు వచ్చాడు వేణు.

అన్యాయానికి ప్రతీకగా నల్లకోటులో వేణు.

కాదు, కాదు - అన్యాయాన్ని ఎదిరించి న్యాయాన్ని రక్షించవలసిన న్యాయవాది.

తన వాక్చాతుర్యంతో నాన్న కేసును కన్స్యూమర్స్ కోర్టుకి కూడా వెళ్లనక్కరలేకుండానే డాక్టరు వద్ద నుండి డబ్బు వసూలు చేసి తనకు ఉద్యోగ దానం చేసిన మిత్రుడు.

"నే నంతా కనుక్కున్నానయ్యా! మీ నాన్నగారికి ధనుర్వాతం రావడానికి డాక్టరు గా రిచ్చిన ఇంజక్షన్ కారణం కావచ్చునట. ఈసారి మనం డైరెక్ట్‌గా కన్స్యూమర్స్ కోర్టులో కేసు వేస్తే, లక్ష రూపాయల వరకూ నష్టపరిహారాన్ని రాబట్టుకోవచ్చు."

'లక్ష రూపాయలు!' శంకరం మనసు ఒక్కసారిగా ఊహాలోకంలోకి వెళ్లిపోయింది.

నిజంగా లక్ష రూపాయలే వస్తే బకాయివడ్డ కట్నం సొమ్ము ఇచ్చి, అక్కను సారె చీరలతో అత్తవారింటికి అంపకం పెట్టవచ్చు.

మిగిలిన సొమ్ముతో ఏదైనా సైడ్ బిజినెస్ పెడితే? అంతకంటే షేర్స్ తీసుకుంటే మంచిదేమో!

ఏది ఏమైనా తమ దరిద్రం శాశ్వతంగా దూరమైపోతుంది. ఇన్నాళ్లకు తమకు మంచి రోజులు వస్తున్నాయి. నాన్న బతికి ఉండగా అందించలేని సౌకర్యాలను చనిపోయి అందిస్తున్నాడు - అనుకున్నాడు శంకరం.

"బాబూ, లాయరు గారూ! ఇప్పటికే జరిగిన అనర్థం చాలు. ఇంకా పాపం మూటగట్టుకోలేం. దయచేసి మమ్మల్ని. మా మానాన వదిలేయండి!" కన్నీళ్లతో చేతులు జోడించి నిలబడిన అమ్మ కళ్లబడేసరికి శంకరం ఊహాచిత్రం ఒక్కసారిగా చెదిరిపోయింది.

మూల గదిలో పడి ఉండే అమ్మకు లాయరుగారి మాటలు ఎలా వినిపించాయో! ఇన్నాళ్లూ నాన్న నీతి నియమాలంటూ తమ అభివృద్ధికి అడ్డుగా నిలిచాడు. ఇపుడు అమ్మ కూడా!

"ఆడవాళ్లు ఒట్టి సెంటిమెంటల్ ఫూల్స్! వాళ్లకు వ్యవహార జ్ఞానం ఏముంటుందీ? నెమ్మది మీద ఆమెకు నచ్చజెప్పి, తరువాత ఆఫీసుకు రా! మాట్లాడుకుందాం!" రహస్యంగా శంకరానికి చెప్పి సెలవు తీసుకున్నాడు లాయర్ వేణు.

కానీ ఆడవాళ్లకు నచ్చచెప్పడం అంత తేలికా?

"అబ్బ! ఏమిటమ్మా, నీ చాదస్తం! సిరి రా మోకాలు అడ్డు పెట్టడమంటే ఇదే. నాన్న ఉద్యోగం చేసినంతకాలమూ నీతి, నియమాలంటూ మా భవిష్యత్‌ను మట్టిపాలు చేశాడు. కనీసం ఈ రకంగానైనా కలసివస్తోందని సంతోషపడుతుంటే ను వ్విలా అడ్డు తగులుతున్నావు. అసలు మా కోసం నాన్న ఏం చేశాడని?"

మాట పూర్తికాకుండానే శంకరం కళ్లముందు మెరుపులు కనిపించాయి.


అవునుమరి, పుట్టిన తరువాత తగిలిన మొదటి దెబ్బ. మండిపోతున్న చెంపకు చేయి చేర్చి వెర్రిగా తల్లినే చూస్తూండిపోయాడు.

అమ్మ కళ్లు నిప్పులు కక్కుతున్నాయి. మండుతున్న అగ్నిగోళంలా ఉంది.

"ఛీ! అప్రాచ్యుడా! నీ కోసం మీ నాన్న ఏం చెయ్యలేదురా! చివరికి తన ప్రాణాలనే నీ కోసం ధారపోశారురా! అస లేం జరిగిందో నీ కేం తెలుసు?" అంటున్న అమ్మ మాటలకు తెల్లబోయాడు.

"నీకు జ్ఞాపకం ఉందా! ఆ రోజు ఇంటర్వ్యూ నుండి వచ్చిన సాయంత్రం పాతిక వేలు లంచం ఇస్తే నీకు ఉద్యోగం వస్తుందని చెప్పిన రోజు - ఆ రాత్రి మంచినీళ్లు కూడా ముట్టలేదు మీ నాన్న. ఆ రాత్రి ఒక్క క్షణం కూడా కన్ను మూయలేదు. తెల్లవారిన తరువాత డాక్టరు గారి దగ్గరకు బయలుదేరిన మీ నాన్న వైపు నువ్వు చూసిన చూపు నేను బతికి ఉండగా మరిచిపోలేను. మీ నాన్న ఒట్టి స్వార్థపరుడని అనుకున్నావు కదూ! ని న్ననడం ఎందుకులే! ఆయనతో ఇంతకాలం జీవితాన్ని పంచుకున్న నేనే ఆయన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయాను.

"డాక్టరు గారి దగ్గరకు వెళ్లివచ్చిన మరునాటి ఉదయం ..."



నీళ్లు నిండిన జానకమ్మ కళ్ల ముందు ఆనాటి సంఘటన మెదిలింది.

** ** **

ఆ రోజు

నిద్ర కళ్లతో పెరటి వైపు వచ్చిన జానకమ్మ గుమ్మంలోనే చిత్తరువులా నిలబడిపోయింది.

రాత్రి కురిసిన వర్షం నీరు గుంటలలో నిలిచి ఉంది.


ఆ నీటిని సిరెంజ్‌లోకి తీసుకుని తన చేతికి ఇంజెక్ట్ చేసుకుంటున్న భర్తను చూసి తెల్లబోయింది.

"అయ్యో! అయ్యో! అదేం పనండీ!" లబలబలాడుతున్న భార్యను చూసి, అపరాధిలా తలవంచుకున్నాడు రామకృష్ణయ్య.

"ఏమిటండీ, మీరు చేస్తున్న పని!" నిలదీస్తున్న భార్య నోరు మూసి లోపలకు తీసుకువచ్చాడు.

"శంకరానికి ఉద్యోగం రావాలంటే ఇంతకంటే వేరే మార్గం కనిపించలేదు" అంటున్న భర్త వైపు అయోమయంగా చూసింది. 'తాటిచెట్టు ఎందుకు ఎక్కా వన్న' సామెతలా ఉంది. ఒక్క క్షణం ఆయనగారికి మతి చలించిందేమో ననే అనుమానమూ రాకపోలేదు.

"మ రేం లేదు జానకీ! నిన్న డాక్టరుగారు చేసిన ఇంజెక్షన్ సెప్టిక్ అయిందనుకో! ఆయన



దగ్గర నష్టపరిహారం వసూలు చేసి ఆ డబ్బుతో శంకరానికి ఉద్యోగం సంపాదించవచ్చు."

"అయ్యయ్యో! ఇ దెక్కడి అన్యాయమండీ!" జానకమ్మ కళ్ళు నీళ్ల పర్యంతమయింది.

"ఇలా అన్యాయంగా సంపాదించలేదనేగా ఇన్నాళ్లూ సాధిస్తూ వచ్చావు!" విచారంగా నవ్వాడు రామకృష్ణయ్య.

ఇన్నాళ్లూ అన్న మా టేమిటి, మొన్న తను అన్న మాటలు ...?

ఒక్క క్షణం జానకమ్మ మనసు పశ్చాత్తాపంతో దహించుకుపోయింది.

"అయ్యో! వాడి కింకా ఉద్యోగం రాలేదన్న బాధతో ఏదో అంటే మాత్రం!"

"పాపమో, పుణ్యమో నా కింతకంటే వేరే మార్గం కనిపించలేదు, జానకీ! కనీసం ఈ విధంగానైనా శంకరానికి ఉద్యోగం వస్తే వాడికి పెళ్లి చేసి, ఆ వచ్చిన కట్నం డబ్బుతో అమ్మాయిని అత్తవారింటికి పంపిస్తే మన బాధ్యత తీరిపోతుంది."

"ఏమైనా వికటిస్తే!" భయంగా అంది జానకమ్మ.

"మ రేం భయం లేదు, జానకీ! ఇప్పుడు కొత్త మందులు ఎన్ని వచ్చాయనీ! అన్నట్లు ఈ విషయం మూడో కంటివాడికి తెలియకూడదు సుమా!"

** ** **

"అనుకున్నట్లుగానే ఇంజెక్షన్ చేసిన చోట చీము పట్టి చెయ్యి కుళ్లిపోవడం, నష్టపరిహారం తీసుకుని ఆ డబ్బుతో ని న్నొక ఉద్యోగస్తుడ్ని చేయటం - అన్నీ ఆయన అనుకున్నట్లుగానే జరిగాయి. పాపిష్ఠిదాన్ని ఆయన తెలివితేటలకు మురిసి ముక్కలయ్యాను.

"చెయ్యి బాగుపడిందని సంతోషించానే గాని, చేసిన పాపం ఇలా కాలనాగై కాటు వేస్తుందని మాత్రం ఊహించలేకపోయాను." ఒక్కసారిగా బావురుమంది జానకమ్మ.

వింటున్న శంకరం కాళ్ల కింద భూమి కదిలిపోతున్న అనుభూతి.

ఇంటిముందు కూకటి వేళ్లతో కూలిపోయిన వటవృక్షం కళ్లముందు కనిపిస్తోంది.

★



నిత్యం మీ వంటలకు, ఘుమఘుమలాడే ఊరగాయలకు

అగ్ మార్క్

A.S. బ్రాండ్ పప్పునూనె మరియు

మేన్షన్ బ్రాండ్ నువ్వులనూనెలనే వాడండి.




80సం॥లకు పైగా ప్రసిద్ధిగాంచినది.

ఇప్పుడు ఎకానమీ ప్యాక్‌లో కూడా లభిస్తుంది

అంబటి సుబ్బన్న అండ్ కో సామర్లకోట, ఆంధ్రప్రదేశ్ | ESTD: 1910

బ్రాంచీలు: డా. ఉళ్ళక్కి స్ట్రీట్, తెనాలి-1. ఫోన్: 3150 ● 1-3-166, రాజామొదలియార్ స్ట్రీట్, కళాసిగూడ, సికింద్రాబాద్-3 ఫోన్: 76160

డిస్ట్రిబ్యూటర్లు: మెస్సర్స్: మాజేటి వీర రాఘవయ్య, శోభనాద్రిలైను, విజయవాడ-1, ఫోన్:423567 ● మెస్సర్స్: ఇమ్మిడిశెట్టి రామకృష్ణయ్య సన్స్, బరంపురం-2. ఫోన్: 72043 ● మెస్సర్స్: బాలాజీ ట్రేడింగ్ కంపెనీ, 25, లేక్ రోడ్, కలకత్తా-29 ఫోన్స్: 740941, 741960 మెస్సర్స్: హీరా ట్రేడింగ్ కంపెనీ, గోలి మూరి బజార్, జంషెడ్‌పూర్ - 3 ఫోన్స్ : 24846, 28944

TARA.1183